

హాస్టళ్లు నడవక

ప్రభుత్వం వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకోక, విద్యార్థులు రాక వెలవెలబోతున్నాయి.


8లో▸



మహిళలు సత్తా చాటాలి

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి పేర్కొన్నారు.

9లో▸



న్యూస్‌రీల్

రేపు మహిళా జాబ్ మేళా

పూడూరు: ఈ నెల 11న పరిగిలో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ కార్యదర్శి పెంటయ్య సూచించారు. మంగళవారం ఉదయం 10గంటలకు పరిగి జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఈ మేళా ఉంటుందని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన మహిళలు సర్టిఫికెట్లతో హాజరవ్వాలని సూచించారు. ఎంపికైన వారికి ఎమ్‌ఎస్‌ఎన్ కంపెనీలో వసతితో కూడిన ఉద్యోగం ఉంటుందని చెప్పారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ విద్యార్థులకు రూ.125, ఓసీలకు రూ.200 దరఖాస్తు రుసుము ఉంటుందని చెప్పారు. ఈ నెల 20 వరకు దరఖాస్తులకు అవకాశం ఉందని ఏప్రిల్ 20న పరీక్ష ఉంటుందని చెప్పారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ధారూరు ఎస్‌ఐ అనిత



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అనిత

ధారూరు: వ్యాపారస్తులు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని ధారూరు ఎస్‌ఐ అనిత సూచించారు. ఆదివారం ఆమె పీఎస్‌లో వ్యాపారులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేరాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్త పడాలని సూచించారు. సీసీ కెమెరాల డీవీఆర్‌ను నేరస్తుల కంటబడకుండా అమర్చుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో వ్యాపారులు సాయికుమార్, షకీల్‌బాబా, శేఖర్, రఘు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్ అంత్యక్రియలు పూర్తి



కేశంపేట: అమెరికాలోని మిల్వాకీ పట్టణంలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన కేశంపేట గ్రామానికి చెందిన గంప ప్రవీణ్‌కుమార్ మృతదేహం ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని శంషాబాద్ నుంచి కేశంపేటకు తరలించి అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి వేర్వేరుగా నివాళి అర్పించారు.

సమన్వయ కమిటీలో 'చల్లా'కు చోటు



వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే జైబాపు, జై భీమ్, జై సంవిదాన్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరుగురు సభ్యులతో రాష్ట్ర సమన్వయ కమిటీని నియమించారు. ఇందులో సమన్వయకమిటీ సభ్యుడిగా చల్లా వంశీచందర్‌రెడ్డికి అవకాశం కల్పించారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక చట్టం తేవాలి

శంకర్‌పల్లి: దివ్యాంగుల కోసం ప్రత్యేక చట్టం తేవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం కోసం లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని జన్వాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో దివ్యాంగులు 12 శాతం ఉన్నారని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రెండు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఇద్దరు నామినేటెడ్ పోస్టుల కోసం ప్రత్యేక చట్టం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అదే తరహా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మన రాష్ట్రంలో ప్రవేశపెట్టాలన్నారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పట్టణ కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సుదర్శన యాగంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. – పరిగి



ముగిసిన మహోత్సవం

వికారాబాద్ పట్టణం ఎన్నేపల్లి సమీపంలో వెలిసిన తోట్ల ఎల్లమ్మ తల్లి సహిత పరుశరామ నాగప్రతిష్ఠ ఆలయ పునఃనిర్మాణ ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పూర్ణాహుతి పూజలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఆలయ పునఃనిర్మాణ కర్త రత్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు సత్యనారాయణ, మంజుల తదితరులు పాల్గొన్నారు. – అనంతగిరి

సమీకృత గురుకులాల నిర్మాణానికి టెండర్లు

ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్

- నాలుగు నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య
- పాత కొడంగల్ శివారులో 20 ఎకరాలు కేటాయింపు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

కొడంగల్: మున్సిపల్ పరిధి పాత కొడంగల్ శివారులో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు టెండర్లను ఆహ్వానించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. కుల మతాలకు అతీతంగా అన్ని గురుకుల పాఠశాలలను ఒకే చోట నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యా వ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలుండగా తొలి విడతలో 55 నియోజకవర్గాల్లో గురుకుల భవనాలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు ప్రభుత్వం రూ.11 వేల కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో గురుకులాల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పాత కొడంగల్ శివారులోని 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అధునాతనమైన భవనాలను నిర్మించడానికి అధికారులు టెండర్లను పిలిచారు. 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకులాలను నిర్మించనున్నారు. తరగతి గదుల్లో డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, లైబ్రరీలను ఏర్పాటు చేస్తారు. కుల మత వర్గ అంతరాలు లేని విద్యాసౌధంలో క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌తో పాటు బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌లో ప్రత్యేక చొరవతో పనులు చేయనున్నారు.

విద్యకు తొలి ప్రాధాన్యం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేశారు. రూ.11 వేల కోట్ల నిధులను వెచ్చించి ఏడాది లోపు పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంతంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, వెటర్నరీ యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు.

పడకేసిన పశువైద్యం

- డాక్టర్ లేక నిరుపయోగంగా మారిన వైద్యశాల
- అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ పశు వైద్యులు
- డాక్టర్‌ను నియమించాలని పోషకుల విజ్ఞప్తి

దుద్యాల్: ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పడిన సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల కేంద్రంలో రైతులకు చేరువలో ఉండేందుకు పశువైద్యశాల ఏర్పాటు చేశారు. పశువులకు ఏదైనా సమస్యలుండి ఆస్పత్రికి తీసుకువస్తే వైద్యులు ఉండడం లేదు. ప్రస్తుతం ఎండలు మండుటెండల్లో మూగజీవాలకు వివిధ రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. వాటికి వైద్యం అందించేందుకు పశువైద్యులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. వీఆర్వోలకు పోస్టింగ్‌లు సర్దుబాటు చేసే సమయంలో దుద్యాల పశువుల ఆస్పత్రిలో ఓ వీఆర్‌ఓను అటెండర్‌గా నియమించారు. ఆయనకు పశువైద్యంపై అవగాహన శూన్యం. ఏదైనా సమస్యలతో మూగజీవాలను అక్కడకు తీసుకువెళ్తే ఆయన వైద్యం అందించలేక ఇబ్బంది పడుతున్నారంటూ రైతులు వాపోతున్నారు. ఆయన వేరే వైద్యులను అడిగి చికిత్స అందించడం లేదా.. ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నాడని చెబుతున్నారు. ప్రైవేట్ వైద్యులు సాధారణ చికిత్సలకు సైతం ఎక్కువ డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువైద్యులను నియమించాలని కోరుతున్నారు.



దుద్యాల పశు వైద్యశాల

పోస్టు మంజూరు లేదు



దుద్యాలకు పశువైద్యుడి పోస్టు లేకపోవడంతో డాక్టర్‌ను నియమించ లేకపోతున్నారు. బొంరాస్‌పేట వీఏకు దుద్యాల్ అదనపు బాధ్యతలు అప్పగించారు. అందుబాటులో ఉన్న అటెండర్‌కు చికిత్స నేర్పిస్తున్నాం. ఆయన గతంలో వీఆర్‌ఏగా పనిచేశారు. ఆయనకు ఇబ్బందిగా ఉన్న సమయంలో మేమే వస్తున్నాం. ప్రైవేటు వైద్యులు అధిక ఫీజు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందింది. వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రమీల, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, బొంరాస్‌పేట్



చెరువుల చెంత గస్తీ

- ఆక్రమణలపై హైడ్రా నజర్
- పరిరక్షణకు పహారా
- షిఫ్టుల వారీగా సిబ్బంది విధులు
- అన్యాక్రాంతం కాకుండా చూడడమే పని
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

తుర్కయంజాల్: చెరువులు, కుంటలు, కాలువలను కబ్జా చేయలనుకునే వారు తస్మాత్ జాగ్రత్త. నిత్యం జలవనరుల వద్ద షిఫ్టుల వారీగా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్)కు చెందిన ఫోర్స్ గస్తీ కాస్తోంది. ఇటీవల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా ఇక మీదట వీటి పరిరక్షణకు నడుం బిగించింది. కొన్ని రోజులుగా పలు చెరువుల వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా సిబ్బంది పహారా కాస్తున్నారు. దీంతో అక్రమణదారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటానికి సాహసించడం లేదు.

ఇరిగేషన్ సిబ్బంది సైతం..

హైడ్రాతో పాటు ఇరిగేషన్ అధికారులు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రి వేళల్లో చెరువుల వద్దకు వచ్చి పరిశీలిస్తున్నారు. ఇటీవల తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, ఇంజాపూర్‌లోని జిలావర్ ఖాన్ చెరువు, పెద్ద అంబర్‌పేటలోని ఈదుల కుంట వద్ద హైడ్రా సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. హైడ్రా, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ పెరగడంతో చెరువుల్లో మట్టి పోయడానికి ప్రయత్నాలు కూడా చేయడం లేదు. నెల రోజుల క్రితం మాసబ్ చెరువు వద్ద గస్తీ ప్రారంభించకముందు ఓ వ్యక్తి చెరువులో పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేసిన విషయం తెలిసిందే. అతడిపై కేసు నమోదు చేయడంతో పాటు, చెరువులో పోసిన మొత్తం మట్టిని అధికారులు దగ్గరుండి తొలగించారు.

అన్యాక్రాంతం కాకుండా..

జిల్లాలో మొత్తం 1,075 చెరువులు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ ప్రభావం అధికంగా ఉండే అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, గండిపేట, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మండలాల్లో ఆక్రమణలు ఎక్కువగా జరిగినట్లు గతంలోనే తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ సర్వేలో వెల్లడైంది. వీరి సర్వే ప్రకారం 225 చెరువులు పూర్తిగా, 196 చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు వెల్లడించారు. ఇలా కబ్జాదారుల చేతుల్లో చిక్కుకుని అన్యాక్రాంతం అవుతున్న వాటిని కాపాడడమే లక్ష్యంగా హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం అందించండి

చెరువుల్లో మట్టి పోస్తున్న వారి సమాచారం అందించాలని ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశాం మట్టిని తరలిస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీల ఫొటోలు, వీడియోలు 90001 13667 నంబర్‌కు పంపించండి. టోల్ ఫ్రీ నంబర్ 18005990099, ల్యాండ్ లైన్ 040–29560509, 040–29560596, 040–29565758, 040–29560593 నంబర్లలోనూ ఫిర్యాదు చేయెుచ్చు.

– వంశీ, ఇరిగేషన్ ఏఈ, అబ్దుల్లాపూర్‌మెట్

డంప్ చేస్తే పట్టేస్తాం

ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో చెరువుల వద్ద విధులు నిర్వర్తిస్తున్నాం. చెరువుల్లో వ్యర్థాలు, మట్టి డంప్ చేసే వారిని గుర్తించడమే మా పని. ఒకే దగ్గర కూర్చుని కాకుండా చుట్టూ తిరుగుతూ గస్తీ కాస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి ఎవరైనా కబ్జాలకు ప్రయత్నిస్తే హైడ్రా దృష్టికి తీసుకురావాలి.

– దర్శనపు తిరుపతయ్య, హయత్‌నగర్ టీం–3

వేల కోళ్లు మృత్యువాత

- రెండు రోజుల వ్యవధిలో 12 వేలు..
- నాలుగు రోజుల క్రితం 7 వేలు..
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్

యాచారం: మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో రెండు రోజుల వ్యవధిలోనే 12 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన చల్లా కృష్ణారెడ్డి రూ.5 లక్షలు ఖర్చు చేసి తన పౌల్ట్రీ షెడ్లలో కోడిపిల్లల పెంపకం చేపట్టాడు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ అమ్మకాలు పడిపోవడంతో షెడ్లలో ఉన్న కోళ్లను 40 రోజుల దాటినా ఇంటిగ్రేషన్ కంపెనీలు తరలించడం లేదు. దాదాపు రెండున్నర కిలోల బరువు పెరిగిన 12 వేల కోళ్లు శని, ఆదివారాల్లో అకస్మాత్తుగా మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన కోళ్లను చల్లా కృష్ణారెడ్డి తన వ్యవసాయ పొలంలోనే గోతులు తీసి పూడ్చిపెట్టాడు. ఇదే గ్రామానికి చెందిన ముత్యాల వెంకట్‌రెడ్డి అనే రైతుకు చెందిన రెండు షెడ్లలో ఉన్న ఏడు వేల కోళ్లు సైతం నాలుగైదు రోజుల క్రితం మృతి చెందాయి. దీంతో రూ.లక్షల్లో ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని ఆ రైతులు బోరుమంటున్నారు. కంపెనీల వైద్యులు వచ్చి బర్డ్ ఫ్లూ వైరస్‌తోనే కోళ్లు చనిపోయాయని చెప్పినట్లు వారు తెలిపారు. ఒకేసారి వేలాది కోళ్లు మృత్యువాత పడుతుండడంతో మిగతా రైతులు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

కోళ్లు పూడ్చేశారు.. నిర్ధారించలేం..

నానక్‌నగర్‌లో నాలుగైదు రోజుల్లోనే 19 వేల కోళ్లు మృతి చెందాయని ఆలస్యంగా సమాచారం తెలిసిందని నక్కర్తమేడిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన గ్రామానికి చేరుకుని బాధిత రైతులు ముత్యాల వెంకట్‌రెడ్డి, చల్లా కృష్ణారెడ్డి షెడ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. అప్పటికే రైతులు మృతి చెందిన కోళ్లను పూడ్చేశారు. కోళ్లు లేనందున బర్డ్‌ఫ్లూతోనే మృతి చెందాయని నిర్ధారణ చేయలేమని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానని చెప్పారు.



మృతి చెందిన కోళ్లను పూడ్చటానికి జేసీబీలో తరలిస్తున్న రైతులు

ఏడు వేల కోళ్లు..



ఓ ఇంటిగ్రేటెడ్ కంపెనీ సహకారంతో రెండు పౌల్ట్రీఫాం షెడ్లలో ఏడు వేల కోళ్ల పెంపకం చేపట్టాను. నాలుగు రోజుల కింద 500 కోళ్లు ఒకేసారి చనిపోయాయి. తర్వాత రెండు రోజులకే మూడున్నర కిలోల బరువున్న మరో 6,500 కోళ్లు మృతి చెందాయి. కంపెనీ వైద్యులు వచ్చి బర్డ్ ఫ్లూ లాంటి వైరస్ సోకిందని తెలిపారు.

– ముత్యాల వెంకట్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

ఒకేసారి చనిపోయాయి



రూ.5 లక్షల ఖర్చు చేసి సొంతగా రెండు షెడ్లలో 12 వేల కోళ్ల పెంపకం చేపట్టాను. శని, ఆదివారాల్లోనే ఒకేసారి 12 వేల కోళ్లు మృతి చెందాయి. చేసేది లేక గుంత తీసి పూడ్చేశాం. రాత్రి, పగలు కష్టపడి పెంచిన కోళ్లు చేతికొచ్చిన సమయంలో చనిపోయాయి. కన్నీళ్లు ఆగడం లేదు.

– చల్లా కృష్ణారెడ్డి, రైతు నానక్‌నగర్

స్వార్థ రాజకీయాలు తగవు

షాద్‌నగర్: రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాలు మానుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం 'భారత రాజ్యాంగం – ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలే తప్ప స్వార్థ కోసం రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. అలాంటప్పుడే పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పాలకులు, నాయకులు అవలంబిస్తున్న విధానాలు ఆమోదయోగ్యంగా లేవన్నారు. రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటివి ఉన్నా వాటి ఫలాలు పేదలకు అందడం లేదన్నారు. పేదలకు సరైన విద్య, వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే మేధావులపై అక్రమంగా కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో పడుతున్న రాజ్యాంగాన్ని ఐక్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరు అధ్యయన కమిటీ చైర్మన్ రాఘవాచారి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనా తాగునీటి సమస్య మాత్రం తీరలేదని అన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి సాగు, తాగునీటిని అందించాలన్నారు. సదస్సులో తెలంగాణ జేఏసీ తాలుకా చైర్మన్ జనార్దన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాసభను విజయవంతం చేయండి

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్


శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా రెండో మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 11(మంగళవారం)న శంకర్ పల్లి మండల పరిధిలోని పొద్దటూరు శివారులోని ప్రగతి రిసార్ట్స్‌లో నిర్వహిస్తున్న జిల్లా రెండో మహాసభకు మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మాజీద్, సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, కార్యదర్శి రాం నారాయణలతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని వారు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులు అందరూ మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలో 25 సంవత్సరాలకు పైగా విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఈ మహాసభల సందర్భంగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి జర్నలిస్టులు హాజరు కావాలని కోరారు.

బైక్, ఆటో ఢీకొని వ్యక్తి మృతి

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న బైక్, ట్రాలీ ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కొత్తపల్లి తండాకు చెందిన రమేశ్(30) కూలీ పనులు చేసేవాడు. శనివారం రాత్రి ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై చౌడాపూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కిష్టంపల్లి నుంచి వస్తున్న ట్రాలీ ఆటో మక్తవెంకటాపూర్ గేటు గ్రామశివారులో ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

యాలాల: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహకారంతో తిరిగి అప్పగించారు. ఇటీవల బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన గాజుల రాములు మాతాశిశు ఆస్పత్రి వద్ద, యాలాల మండలం పరిధి పగిడిపల్లికి చెందిన లొంకాల గోవింద్ జుంటుపల్లిలో మొబైల్ పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఫోన్లను గుర్తించారు. ఈ మేరకు ఎస్‌ఐ గిరి ఆదివారం బాధితులకు అందజేశారు.

ఆరు ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

యాలాల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని యాలాల, సంగెంకుర్దు, కోకట్ గ్రామాల పరిధిలో ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు చేపట్టి ఆరు ట్రాక్టర్లను యాలాల ఠాణాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్లు ఢీ.. నలుగురికి గాయాలు


పల్టీ కొట్టిన కారు

పరిగి: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తుంకల్‌గడ్డ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిట్టకోడూర్ గ్రామానికి చెందిన కొందరు కారులో పరిగి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చిగురాల్‌పల్లి నుంచి పరిగికి కొందరు కారులో వస్తుండగా తుంకల్‌గడ్డ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రెండు కార్లల్లో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పిల్లలు లేక.. హాస్టళ్లు నడవక

ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉన్న వసతి గృహాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. విద్యార్థులు రాకపోవడం, ప్రభుత్వం సైతం వీటి అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో చాలా చోట్ల హాస్టళ్లు మూతబడుతున్నాయి.

మూతపడిన వసతి గృహాలు

- వృథాగా మారుతున్న భవనాలు


తొర్మామిడిలో మూతపడిన ఎస్సీ హాస్టల్ భవనం

బంట్వారం: పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం చాలా కాలం కిందట మండల పరిధిలోని తొర్మామిడిలో మూతపడింది. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. తొర్మామిడి గ్రామంలో 2009లో ఎస్సీ హాస్టల్ భవనం ప్రారంభించారు. ఇందుకు గాను అప్పట్లో బీఆర్‌జీఎఫ్, జెడ్పీ నిధులు అవసరమైన మేరకు వెచ్చించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ వసతిగృహం ప్రారంభించిన ఏడాది కాలంలోనే హాస్టల్ మూతపడింది. ఊరికి కిలో మీటరు దూరంలో భవనం కట్టించడంతో విద్యార్థులు అందులో ఉండేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో చేసేదేమీ లేక అధికారులు కూడా ఏడాదిలోనే హాస్టల్‌ను మూసి వేశారు. భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో ప్రస్తుతం బూత్ బంగ్లాను తలపిస్తుంది.

బంట్వారంలోనూ అదే పరిస్థితి

మండల కేంద్రం బంట్వారంలోని బీసీ వసతి గృహం పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే ఉంది. విద్యార్థులు లేరనే సాకుతో సంబంధిత అధికారులు ఆరేళ్ల కిందట బీసీ హాస్టల్‌ను మూసి వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2005 సంవత్సరంలో మత్స్యశాఖ ఈ భవనాన్ని కట్టించింది. అది ఏడాదిలోనే కూలే స్థితికి చేరింది. దీంతో అప్పట్లో వెంటనే అద్దె భవనంలోకి హాస్టల్‌ను మార్చారు. అందులో చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు ఉంటూ చదువుకునే వారు. ఉన్నట్టుండి బీసీ వెల్ఫేర్ అధికారులు 2017లో వసతి గృహాన్ని ఎత్తివేశారు. పిల్లలు లేరనే కారణంతో కోట్‌పల్లి ఎస్సీ హాస్టల్‌ను కూడా గతంలోనే ఎత్తి వేశారు. కోట్‌పల్లి కొత్త మండలముగా ఏర్పడడంతో హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలుగా వాడుకుంటున్నారు.

హాస్టళ్లకు తగ్గిన ఆదరణ

గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో సీటు దొరకాలంటేనే పెద్ద కష్టంగా ఉండేది. రాను రాను హాస్టళ్లకు ఆదరణ పడిపోయింది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో మూతపడే స్థాయికి చేరుకున్నాయి. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు వచ్చిన నాటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉండే వారు కరువయ్యారు. నానాటికి మూతపడే దశకు చేరుకుంటున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్‌ఎస్ స్కూళ్ల పరిస్థితి కూడా అలాగే తయారైంది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. చిన్నారులు గురుకులాలు, మోడల్, కేజీబీవీల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు.

పవిత్రమాసం.. ప్రత్యేకం

- అంతటా రంజాన్ సందడి
- కఠోర ఉపవాస దీక్షలో ముస్లింలు


ఇఫ్తార్ పార్టీలో పాల్గొన్న ముస్లింలు

పహాడీషరీఫ్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లిం ప్రజలు నియమ నిష్ఠలతో జరుపుకొంటున్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాస దీక్షలో ఉంటున్న ముస్లింలు రాత్రంతా మెళకువతో ఉంటున్నారు. సాయంత్రానికి ఎర్రకుంట, షాయిన్‌నగర్, పహాడీషరీఫ్, కొత్తపేట రహదారులు సందడిగా మారుతున్నాయి. చిన్న, పెద్ద, పేద, ధనిక అనే తేడా లేకుండా అంతా రంజాన్ పండగలో నిమగ్నమయ్యారు. ప్రతిరోజు ఫజర్, జోహర్, అసర్, మగ్రీబ్, ఇషా నమాజ్‌ల చొప్పున ఐదుసార్లు నమాజ్ చేసి అల్లాహ్‌ను స్మరిస్తున్నారు.

ఇఫ్తార్ విందుల ఆరగింపు

రంజాన్ మాసం ప్రారంభం కావడంతో తొలి రోజు నుంచే ఇఫ్తార్ విందులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ పవిత్రమైన మాసంలో కాస్త ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసి పరిచయస్తులను ఆహ్వానిస్తుంటారు. ఉపవాస దీక్ష విరమించిన ప్రజలు ఇఫ్తార్ విందులలో ఏర్పాటు చేసే పండ్లను ఆరగించడం ఆనవాయితీ. ఇందులో అన్ని రకాల పండ్లతో ఖర్జూరం వంటి వాటిని కూడా ఏర్పాటు చేస్తారు. ఇఫ్తార్ విందులలో హిందూ, ముస్లింలు పాల్గొని మత సామరస్యాన్ని చాటి చెబుతున్నారు.

హలీం దుకాణాల వద్ద సందడి

ఈ మాసంలో ప్రధానంగా గుర్తుకొచ్చేది హలీం. రోజంతా ఉపవాస దీక్షలో ఉండే వారు సాయంత్రం దీక్ష విరమించిన అనంతరం పోషక విలువలున్న హలీంను ఆరగిస్తారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలయ్యిందంటే స్థానికంగా ఉన్న హలీం సెంటర్లు రద్దీగా మారుతున్నాయి. పహాడీషరీఫ్ పరిసరాలలో ఏర్పాటు చేసిన హలీం కేంద్రాలే కాకుండా పాత నగరంలో ఉన్న షా గౌస్, పిస్తాహౌజ్, షాదాబ్ వంటి హోటళ్ల నుంచి హలీం పార్సల్‌ను తెప్పించుకొని భుజిస్తున్నారు.

పెద్ద ఎత్తున జకాత్

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తమకున్న ఆస్తిలో కొంత శాతాన్ని పేద ప్రజలకు వెచ్చించాలి. ఇందులో భాగంగానే జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లింలు పెద్ద ఎత్తున దానధర్మాలు చేస్తున్నారు. పేద ప్రజలకు చీరలు, గృహావసర వస్తువులు ఇలాంటి వాటిని దానం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో ఈ దాన ధర్మాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.



పారిశుద్ధ్యం అధ్వానం

తాండూరు రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటైన చెంగోల్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఓ కాలనీలో ఇళ్ల నుంచి మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో అటువైపు వెళ్లే గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీలో సీసీ రోడ్డు సైతం లేకపోవడంతో బురదమయం అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వలు, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డు పనుల్లో అమ్మవారి విగ్రహం లభ్యం



బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో ఆదివారం ఓ దేవతామూర్తి విగ్రహం బయట పడింది. గ్రామానికి రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులు మంజూరు కావడంతో పనులు జరుగుతుండగా అమ్మవారి విగ్రహం బయట పడటంతో గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

కాకునూర్‌లో మేకల చోరీ

కేశంపేట: అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మేకలను దోచుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాలయ్య మేకలను మేపతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజు మాదిరిగానే ఆయన శనివారం మేకలను మేతకు తీసుకెళ్లాడు. రాత్రికి పాకలో వాటిని బంధించి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఇంటి ముందర ఉన్న పాకలో నుంచి 10 మేకలను దొంగిలించారు. దీంతో మేకలు, కుక్కలు అరవడంతో లాలయ్య కుటుంబంతో బయటికి వచ్చి చూడగా దుండగులు పారిపోయారు. దొంగలను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. కేశంపేట వైపు కారులో వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నరహరి చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

ఎనిమిది మంది జూదరులు అరెస్టు

ఇబ్రహీంపట్నంరూరల్: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని శ్రీనివాస రంగాపురం కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.93,140 నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తల, మొండెం వేరుగా..

కుళ్లినస్థితిలో మృతదేహం లభ్యం


జంగయ్య (ఫైల్)

కేశంపేట: తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. శవం కుళ్లిపోయి ఉండటంతో, సుమారు 15 రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సీఐ నరహరి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించగా ఆధార్‌కార్డు లభ్యమయ్యింది. దాని ఆధారంగా మృతి చెందిన వ్యక్తి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల గ్రామానికి చెందిన బేరి జంగయ్య(60)గా గుర్తించారు. ఆయన బీరు సీసాలను సేకరించి అమ్ముకొని జీవించేవాడని గ్రామస్తులు తెలిపారు. అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని చెప్పారు. జంగయ్య వేములనర్వ గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లగా ఫిట్స్ వచ్చి మృతి చెందాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే తల, మొండెం వేరు కావడంపై సందేహాలు కొనసాగుతున్నాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

24 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదివారం శామీర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు రోటరీ–1 వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా.. ఏపీ 23 యూ 5899 నంబరు గల లారీలో 24 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ ఎస్‌కే సర్దార్, క్లీనర్ చంద్రం లను అదుపులోకి తీసుకొని విచారించగా సిద్దిపేట జిల్లాకు చెందిన శశికుమార్‌కు అందించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు లారీని సీజ్ చేయడంతో పాటు ఇరువురిపై కేసు నమోదు చేశారు. అనంతరం రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అందజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

నిజాంపేట్: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు పోలీసులు, వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటకకు చెందిన గూడ్స్ క్యారియర్ ఆటోలో లూజు పత్తి విత్తనాలు తెస్తున్నారన్న సమాచారంతో వారు బాచుపల్లి పోలీసులు ఆదివారం మధ్యాహ్నం మల్లంపేట వద్ద తనిఖీలు చేపట్టారు. బాచుపల్లి ఎక్స్‌రోడ్డువైపు కర్ణాటకకు చెందిన ఆటో (కెఏ 34 డీ 0117) వస్తుండగా వారు ఆటోను ఆపి చెక్ చేయగా..15 బస్తాలలో లూజు పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న ఆలేరు మాధవ్, ఆదర్శ్, గొల్ల ఉదయ్‌కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

కాల్ లిఫ్ట్ చేయకపోతే కిడ్నాప్ చేస్తా

వివాహితకు యువకుడి బెదిరింపులు

ఫిలింనగర్: 'ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోతే నిన్ను, పిల్లలను కిడ్నాప్ చేస్తా' అంటూ వివాహితను బెదిరిస్తున్న యువకుడిపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సమతాకాలనీలో నివసించే వివాహిత (32) స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కాగా, 2016 నుంచి భర్త దుబాయ్‌లో ఉంటున్నాడు. గత ఏడాది తన స్కూల్‌లో అడ్మిషన్లకు సంబంధించి ఇన్‌స్టాగాంలో ప్రకటన పోస్ట్ చేసింది. షేక్ వసీం అనే యువకుడు ఆమె ఇన్‌స్టాగాం అకౌంట్‌ను ఫాలో అవుతూ ఆమె ఫోన్ నెంబర్‌ను అడ్మిషన్ కావాలంటూ అడిగి తెలుసుకున్నాడు. తరచూ ఫోన్ చేస్తుండడంతో ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో స్కూల్‌లో సిబ్బంది నుంచి ఆమె పర్సనల్ నెంబర్‌ను కూడా సేకరించాడు. అప్పటి నుంచి స్కూల్‌కు, ఆమె ఇంటికి తిరుగుతూ 24 గంటలూ ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ వేధింపులకు గురిచేయసాగాడు. దీంతో ఆమె పర్సనల్ నెంబర్‌ను కూడా లిఫ్ట్ చేయడం ఆపేసింది. ఈ నేపథ్యంలోనే షేక్ వసీం ర్యాపిడో డ్రైవర్‌ను బుక్ చేసుకుని ఆమె ఇంటికి పంపించి పార్శిల్ ఇస్తారు..తీసుకురా అని చెప్పసాగాడు. ఆమె ఇంటికి వెళ్లిన ర్యాపిడో డ్రైవర్‌ను ఫోన్ ఆమెకు ఇవ్వు మాట్లాడతానంటూ వేధించడం మొదలుపెట్టాడు. గత ఏడు నెలల నుంచి నిందితుడి వేధింపులు రోజు రోజుకు పెరిగాయి. ఇంటి చుట్టూ, స్కూల్ చుట్టూ తిరుగుతూ ఆమెను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం మరింత రెచ్చిపోయిన నిందితుడు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే నిన్ను, పిల్లలను కిడ్నాప్ చేస్తానంటూ మెసేజ్‌లు పెట్టాడు. భయాందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 78(2), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టోల్‌గేట్ సిబ్బంది వారిస్తున్నా..

బైక్‌పై ఔటర్ రింగు రోడ్డు ఎక్కి..ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: టోల్‌గేటు సిబ్బంది వారిస్తున్నా.. బైక్‌పై ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణం చేస్తూ రాంగ్ రూట్‌లో వస్తుండగా ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నారాయణపేట ప్రాంతంలోని పల్లెర్లకు చెందిన సయ్యద్ మహబూబ్ అలీ(54) కుటుంబ సభ్యులతో కలిసి శంషాబాద్‌లోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో ఉంటున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఇతను శనివారం షాద్‌నగర్‌లో పని ఉందంటూ ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో తొండుపల్లి ఔటర్ టోలుగేటు వద్ద అక్కడి సిబ్బంది వారిస్తున్నా వినకుండా.. బైక్‌పై ఔటర్‌పైకి వెళ్లాడు. పెద్దగోల్కొండ వైపు వెళ్లిన అతను..తిరిగి రాంగ్ రూట్‌లో తొండుపల్లి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హుస్సేన్ సాగర్ నీళ్లలో పడి సెక్యూరిటీ గార్డు మృతి


యాదగిరి (ఫైల్)

రాంగోపాల్‌పేట్: లుంబినీ పార్కులో బోటును శుభ్రం చేస్తూ ఓ సెక్యూరిటీ గార్డు ప్రమాదవశాత్తు నీళ్లలో పడి మరణించాడు. ఈ ఘటన లేక్ సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ నల్లకుంట గాంధీనగర్‌కు చెందిన సురారం యాదగిరి (56) గత ఐదేళ్ల నుంచి లుంబినీ పార్కులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం బోటును శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు హుస్సేన్‌సాగర్ నీళ్లలో పడిపోయాడు. అటు తర్వాత పార్కు సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించగా నీళ్లలో పడిపోయినట్లు గుర్తించారు. ఆదివారం సాయంత్రం హుస్సేన్ సాగర్ జలాల్లో మృతదేహం తేలియాడుతుండగా లేక్ పోలీసులు వెలికితీశారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేదల ఇళ్లు.. కాజేసే కుట్ర!

ప్రభుత్వ వ్యవస్థాగత నిర్ణయంలో లోపం... దాన్ని సరి చేయాల్సిన అధికారుల అలసత్వం కారణంగా 150 మంది పేదలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నలభై ఏళ్ల క్రితం సర్కారు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ధరణి పోర్టల్ పేరుతో ఆక్రమించే ఉదంతం మంచాల మండలం లోయపల్లిలో వెలుగు చూసింది.

- నలభై ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన భూములు
- అధికారుల అండతో పాత పట్టాదారుకు బదలాయింపు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు


అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల సర్టిఫికెట్


జీపీ పన్ను చెల్లింపు రసీదు


34, 35 సర్వే నంబర్లలో పేదలు నిర్మించుకున్న ఇళ్లు

మంచాల: పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలనే సదుద్దేశంతో 1985లో మండల పరిధిలోని లోయపల్లిలో ప్రభుత్వం 34, 35 సర్వే నంబర్లలో భూమి కొనుగోలు చేసింది. గ్రామానికి చెందిన నర్సింగ్‌రావుకు సంబంధించి 5.19 ఎకరాలను కొని, ఒక్కోగుంట(121 గజాలు) చొప్పున 150 మంది నిరుపేదలకు పంపిణీ చేసింది. కొందరికి అప్పట్లోనే సర్కారు ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం సైతం చేయించింది. ప్రస్తుతం ఆ స్థలాల్లో అందరూ ఇళ్లు నిర్మించుకున్నారు. లబ్ధిదారులు అన్ని రకాల రుసుము చెల్లించి గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణ అనుమతితో పాటు నల్లా కనెక్షన్లు సైతం తీసుకున్నారు. కరెంట్ సరఫరా సైతం వచ్చింది. రోడ్లతో పాటు అండర్ డ్రైనేజీ వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. ఏటా ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. అక్కడ పూర్తిగా జనాలతో ఇళ్లు నిండిపోయాయి. కానీ సదరు భూమిపై తమకు హక్కులున్నాయని అప్పటి భూ యజమాని వారసులు లబ్ధిదారులను వేధిస్తున్నారు.

బ్రోకర్లతో బెదిరింపులు

2020లో ధరణి పోర్టల్‌లో సదరు భూమికి సంబంధించి అప్పటి పట్టాదారు నర్సింగ్‌రావు పేరు తిరిగి రికార్డులోకి వచ్చింది. అక్కడ గ్రామస్తులు ఇళ్లు నిర్మించుకున్నా తిరిగి పాత పట్టాదారు పేరునే అధికారులు నమోదు చేశారు. ప్రస్తుతం సదరు భూమిని నర్సింగ్‌రావు కుమారుడైన ఆనందరావు కొంత మంది బ్రోకర్ల పేరు మీద 3 నుంచి 5 గుంటల చొప్పున కొనుగోలు చేసినట్లు అక్రమ పట్టా పాసు పుస్తకాలు సృష్టించారు. ఆ పత్రాలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు సైతం తీసుకున్నారు. అంతటితో ఆగకుండా అనాడు ప్రభుత్వం ఇచ్చిన లబ్ధిదారులను భయపెడుతున్నారు. 'మీ ఇళ్ల స్థలాలు మా పేర్ల మీద ఉన్నాయి. నయానో, భయానో ఇవ్వండి.' లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని బెదిరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలి



గ్రామంలో సర్కారు గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. ధరణి పేరుతో ఆ భూమిని తిరిగి రికార్డులో పట్టాదారుపై నమోదు చేయడం దారుణం. రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలిసి గరీబోళ్ల పొట్ట కొడుతున్నారు. తక్షణమే పేదలకు న్యాయం చేయాలి.

– రమేశ్, బాధితుడు, లోయపల్లి

పోరాడుతాం



లోయపల్లిలో 34, 35 సర్వే నంబర్లలో పేదల ఇళ్ల స్థలాల విషయంలో న్యాయం జరిగే వరకు పోరాడుతాం. దీనిపై తహసీల్దార్ కార్యాలయమే కాదు, కలెక్టరేట్‌ను కూడా ముట్టడిస్తాం. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించాలి.

– భాస్కర్, ఎమ్మార్పీఎస్, జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

సర్వే చేస్తాం



గ్రామంలోని 34, 35 సర్వే నంబర్ల భూమి విషయంలో పూర్తి స్థాయిలో సర్వే చేసి విచారణ చేపడుతాం. వాస్తవాలను పరిశీలన చేసి బాధితులకు న్యాయం చేస్తాం.

– ప్రసాద్, తహసీల్దార్, మంచాల